క్లుప్తంగా

సీసీఈ యాప్ నమోదుపై శిక్షణ

నకరికల్లు: పంటకోత ప్రయోగాల ద్వారా సగటు దిగుబడి అంచనా వేయవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు బత్తుల శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రం –1లో పంటకోత ప్రయోగాలు నిర్వహించి ఫలితాలను సీసీఈ యాప్‌లో నమోదు చేయడంపై గ్రామ వ్యవసాయ సహాయకులకు గురువారం శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు రసీదులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ కె.దేవదాసు, ఏఎస్ఓ కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చీమలమర్రి ఉపసర్పంచ్‌గా చిమటా నాగాంజనేయులు



నకరికల్లు: మండలంలోని చీమలమర్రి గ్రామ ఉపసర్పంచ్‌గా చిమటా నాగాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈఓపీఆర్డీ ఎంకేఎస్ గిరిధర్ తెలిపారు. ఉపసర్పంచ్‌గా ఉన్న ముప్పాళ్ల శివకుమారి తన పదవికి రాజీనామా చేయడంతో గురువారం ఎన్నిక నిర్వహించారు. ఈ మేరకు వార్డుసభ్యుల ఆమోదం మేరకు చిమటా నాగాంజనేయులు ఎన్నికైనట్లు తెలిపారు. ఉపసర్పంచ్‌గా నాగాంజనేయులు ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల ఉపేంద్ర, గ్రామ కార్యదర్శి శైలేంద్రకుమార్, పలువురు అధికారులు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

నిషేధిత ఉత్పత్తులు అమ్మితే కఠిన చర్యలు



ముప్పాళ్ల: నిషేధిత పొగాకు ఉత్పత్తులు, మద్యం అమ్మకాలు జరుపుతూ పట్టుబడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ముప్పాళ్ల ఎస్సై డి.కిశోర్‌బాబు చెప్పారు. మండలంలోని మాదల, దమ్మాలపాడు గ్రామాల్లో పలు దుకాణాల్లో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మత్తు పదార్థాలు అమ్మటం చట్టరీత్యా నేరమని, ప్రజలు కూడా అటువంటి వాటిని వాడటం మంచిది కాదన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా నిషేధిత ఉత్పత్తులు అమ్ముతున్నట్లుగా సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి, అమ్మకందారులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు పంపిణీ

క్రోసూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో పాడి రైతులకు పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు గురువారం అందజేయడం జరిగిందని పశు వైద్య అధికారి డాక్టర్ సి.హెచ్.మల్లయ్య తెలిపారు. మండల పరిధిలోని హస్సానాబాద్ గ్రామంతోపాటు పలు గ్రామాల్లో పాడి రైతులకు కార్డులు అందజేసినట్లు తెలిపారు.

పెన్షనర్స్ గదులను ఖాళీ చేయించి న్యాయం చేయండి



సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ బిల్డింగ్ గదులను అద్దెకు తీసుకున్న పయనీర్ ఆటోమొబైల్ షాపును ఖాళీ చేయించి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. గురువారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ బొడ్డు రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ బిల్డింగ్ కింద గదుల లీజు పూర్తయి మూడు సంవత్సరాలు దాటి పోయిందన్నారు. ప్రస్తుతం పెన్షనర్లు భవనంపైకి మెట్లు ఎక్కలేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గదులను వెంటనే ఖాళీ చేయించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై మంత్రి అంబటి రాంబాబు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు గద్దె చలమయ్య, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కె.హనుమంతరావు, గద్దె మురహరిరావు, జక్కుల లక్ష్మీనారాయణ, కె.రంగారెడ్డి, కేబీఆర్‌జే ప్రసాద్, శృంగారం, మల్లేశ్వరరావు, జెయిన్‌లాబ్దిన్, ప్రభుదాసు, ఖాదర్, కె.పోతులూరయ్య, రమాదేవి ఉన్నారు.

నటనకే వన్నె తెచ్చిన నటుడు సూపర్‌స్టార్ కృష్ణ

సత్తెనపల్లి: తెలుగు చలన చిత్ర సీమలో నటనకే వన్నె తెచ్చిన నటుడు సూపర్‌స్టార్ కృష్ణ అని ప్రముఖ న్యాయవాది ఎంవీ సుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని కార్తిక్ రెసిడెన్సీలో గురువారం నిర్వహించిన కృష్ణ ప్రథమ వర్ధంతిలో పాల్గొని మాట్లాడారు. టౌన్ వైడ్ సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చందలూరి రంగారావు, రాజుపాలెం మాజీ జెడ్పీటీసీ మర్రి వెంకట్రామిరెడ్డి, న్యాయవాదులు ఎల్లారెడ్డి, రహీమ్, శివారెడ్డి, సైదా, మనోహర్, ప్రభాకర్, మురళి శ్రీనివాస్, దేవరశెట్టి రవి, శాంతయ్యలు మాట్లాడారు. కృష్ణ చిత్ర పటానికి నివాళులర్పించారు.



పట్టణంలోని 2వ సచివాలయంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న డాక్టర్ గీతా హాసంతి



సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న పక్కాల సూరిబాబు



దిడుగులో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ హనుమంతరావు తదితరులు



పాపాయపాలెంలో వైఎస్సార్‌సీపీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, పార్టీ నాయకులు



నార్నెపాడులో డిస్‌ప్లేబోర్డును ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి

అవినీతి రహిత పాలనకు జగనే కావాలి

- వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి
- సత్తెనపల్లి 2, 3 వార్డుల్లో అట్టహాసంగా 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం

సత్తెనపల్లి: అవినీతి రహిత పాలనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కావాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి అన్నారు. పట్టణంలోని 2,3 వార్డులకు సంబంధించి 2వ సచివాలయంలో గురువారం నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాలుగున్నరేళ్లలో సీఎం జగన్ అవినీతి రహిత పాలన అందించారన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు.చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు మాట్లాడుతూ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా కులమతాలు, పార్టీలు, రాజకీయాలకతీతంగా ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందజేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగన్ పక్షాన ప్రజలంతా నిలబడి వచ్చే ఎన్నికల్లో అఖండమైన మెజార్టీ ఇవ్వాలని పిలుపు నిచ్చారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు ఆర్థిక అభివృద్ధి సాధించారన్నారు. వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావునాయక్‌లు మాట్లాడారు. ముందుగా సచివాలయంలో 2, 3 వార్డులకు సంబంధించి చేపట్టిన రూ.5,65,09,000 అభివృద్ధి, డీబీటీ,నాన్‌డీబీటీ ద్వారా రూ.24,14,58,084 సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేశారు. వార్డులోనే బస చేసేందుకు ఉపక్రమించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు, నాయకులు మాదికొండ నారాయణ, వరికల్లు కోటేశ్వరరావు, లోకా మాధవ, తుమ్మల వెంకటేశ్వరరావు, కొణతం స్వాతి, సంకుల తిరుమలరావు, వల్లెం నరసింహారావు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

దిడుగులో వై ఏపీ నీడ్స్ జగన్

అమరావతి: మండల పరిధిలోని దిడుగు గ్రామ సచివాలయంలో పల్లెకుపోదాం (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ మేకల హనుమంతరావు ప్రారంభించారు. తొలుత సచివాలయంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వివరాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు, ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సుపరిపాలనలో దిడుగు గ్రామానికి రూ.25.51 కోట్లతో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు అమలు జరిగాయన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కొనసాగాలంటే జగనన్న ముఖ్యమంత్రిగా తిరిగి అధికారంలోకి రావాలన్నారు.మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో దిడుగు గ్రామంలో రూ.21.48 కోట్లు సంక్షేమ పథకాలకు, రూ.4.03 కోట్లు అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చుచేశారన్నారు. అనంతరం వైఎస్సార్ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. మండల వైఎస్సార్‌సీపీ జేసీఎస్ అధ్యక్షుడు నాయుడు రాంబాబు, గ్రామ సర్పంచ్ వింతా శ్రీలక్ష్మీ, ఎంపీటీసీ చౌటూరి శ్రీలక్ష్మీ వైఎస్సార్‌సీపీ నాయకుడు టి.రోశయ్య ఈవోపీఆర్డీ గంగాధర్, పలువురు గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

బెల్లంకొండ: నాలుగున్నరేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలల్లోకి తీసుకువెళ్లి, వివరించాలని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని పాపాయపాలెం గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యాక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామ సచివాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గ్రామ ప్రధాన కూడలిలో దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా జరుగుతున్న మంచిని ప్రజలకు వివరించేందుకు 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. మండల సచివాలయ కన్వీనర్ గాదె మిల్లు వెంకటరెడ్డి, సర్పంచ్ చిమటా మాధవి, వెంకటసైదయ్య, ఎంపీటీసీ మర్రి శ్రీనివాసరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ భద్రయ్య, మర్రి ప్రసాదరెడ్డి, చింతారెడ్డి సాయిరెడ్డి, స్కూల్ చైర్మన్ మర్రి చిన్నబ్రహ్మారెడ్డి, నాయకులు మర్రి బ్రహ్మారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహ సారథులు పాల్గొన్నారు.

నార్నెపాడులో వై ఏపీ నీడ్స్ జగన్...

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ శాసనసభ్యులు యర్రం వెంకటేశ్వరరెడ్డి హాజరయ్యారు. ముందుగా గ్రామ సచివాలయంలో నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల బోర్డును ఆవిష్కరించి రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు కావాలో అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో బస చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు డా.గీతా హాసంతి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ బాసు లింగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఎంజీఎం రామలింగారెడ్డి, మండల సచివాలయ జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, ఎంపీటీసీ మనికె ఏసమ్మ, సొసైటీ అధ్యక్షుడు అన్నపురెడ్డి సాయిరెడ్డి, నాయకులు కనుమూరి బాబు, జక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పాలూరి యర్రకోటిరెడ్డి, చిన్నపరెడ్డి కృష్ణారెడ్డి, కనుమూరి సైదారావు, చిన్నం మణిబాబు, సచివాలయ కన్వీనర్ కాలగడ్డ కిశోర్, శ్రీనివాసరావు, సంగం లక్ష్మీ, జనత్‌హుస్సేన్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ రమేష్, కుందురువారిపాలెం సర్పంచ్ చయికం వెంకటప్పారెడ్డి పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే పరిపాలన

రాజుపాలెం: జిల్లా యంత్రాంగాన్నే మీ ఇంటి ముందుకు తీసుకొచ్చి పరిపాలన చేయిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరలా అవకాశం కల్పించాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, లాయర్ పక్కాల సూరిబాబు గ్రామస్తులను కోరారు. మండలంలోని మొక్కపాడులో మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ప్రధాన కూడలిలో వైఎస్సార్ సీపీ పార్టీ జెండాను ఆవిష్కరించారు అనంతరం సమావేశంలో ముఖ్య అతిథి సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు మేలు జరగాలన్నా బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నా, రాష్ట్రానికి మరలా జగన్ కావాలన్నారు. గ్రామ సచివాలయం పరిధిలో 5016 మంది జనాభాకు రూ.13.50 కోట్లు ఖర్చు చేసిన ముఖ్యమంత్రి చరిత్రలో లేరని అన్నారు. జగన్‌ను, రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబును దీవించాలని కోరారు. ఎంపీపీ రాజేశ్వరిచంద్రమౌళి, జెడ్పీటీసీ సునీతాశ్రీనివాసరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ కొడ్రెడ్డి సుజాత, ఎంపీటీసీ ఎస్కే బీబీహుస్సేన్, కోఆప్షన్ మెంబర్ ఎస్కే సుభాని సచివాలయ కన్వీనర్ నరసింహారావు, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ఎస్కే జానీ, ఏబీ మాజీ సొసైటీ అధ్యక్షులు తోట లక్ష్మీనారాయణ, ఎస్కే బాషా, కోటేశ్వరరావు, కాంట్రాక్టర్ నరసింహారావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పారదర్శకపాలన పట్ల ప్రజల విశ్వాసం



చల్లగుండ్లలో బోర్డును ఆవిష్కరిస్తున్న గుంటూరు మార్కెట్‌యార్డు చైర్మన్ రాజనారాయణ

నకరికల్లు: కుల, మత, పార్టీలకు అతీతంగా పారదర్శకతతో సంక్షేమ ఫలాలు అర్హులకు అందించడంతో వైఎస్సార్‌సీపీ పట్ల ప్రజల్లో విశ్వాసం ఏర్పడిందని గుంటూరు మార్కెట్‌యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ అన్నారు. మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో డీబీటీ ద్వారా రూ.27.95 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.7.96 కోట్లు, అభివృద్ధి కార్యక్రమాలకు రూ.4.05కోట్లు వినియోగించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఇలా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు ఎలాంటి వివక్షలేకుండా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, మండల జేసీఎస్ కన్వీనర్ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మేడికొండ రామిరెడ్డి, వంగా రాజారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు మేడికొండ మస్తాన్‌రెడ్డి, సర్పంచ్ అరవా ఆదిలక్ష్మీ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు గోపు పద్మావతి అంజిరెడ్డి, జక్కిరెడ్డి కోటిరెడ్డి, అడ్డరోడ్డు ఉపసర్పంచ్ బైరెడ్డి సుబ్బారెడ్డి, బత్తుల రామాంజినేయులు, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థను బలోపేతం చేస్తున్న సీఎం జగన్

- ధూళ్ళిపాళ్ల ది ఆంధ్రాబ్యాంక్ రైతు సేవా సహకార చైర్మన్ నల్లబోతు



సహకార జెండా ఎగురవేస్తున్న నల్లబోతుల శివనారాయణ

సత్తెనపల్లి: సహకార సంఘ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలోపేతం చేస్తున్నారని, నాలుగున్నరేళ్లుగా సహకార సంఘాలు అభివృద్ధి చెందుతున్నాయని ధూళ్ళిపాళ్ల ది ఆంధ్రాబ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివ నారాయణ అన్నారు. అఖిల భారత సహకార దినోత్సవం సందర్భంగా ధూళ్ళిపాళ్ల ది ఆంధ్రాబ్యాంక్ రైతు సేవా సహకార సంఘ ఆవరణలో గురువారం నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం సహకార వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు.జగనన్న ప్రభుత్వంలో సహకార సంఘాల బలోపేతానికి చర్యలు తీసుకోవడంతో అన్నదాతలకు ఉపయోగపడుతున్నాయన్నారు. ఎకరానికి రూ.3 లక్షల వరకు రుణాలు ఇచ్చే స్థాయికి తమ సహకార సంఘం ఎదిగిందన్నారు. జగనన్న పాలనలో సహకార సంఘాలు లాభాల బాటలో నడుస్తున్నాయన్నారు. వీటితో పాటు రైతుల కోసం ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నదాతలకు అండగా నిలబడుతోందన్నారు. సహకార జెండాను ఆయన ఎగురవేశారు. డైరెక్టర్ శివారెడ్డి, డిపార్ట్‌మెంట్ అధికారులు టి.రజిని, ఎస్‌డీఎల్ సీఓ పరిమళ, ఏఆర్ ఎంవీ నరసయ్య, సీనియర్ ఇన్‌స్పెక్టర్, బ్యాంకు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జైత్రయాత్రగా... సామాజిక యాత్ర

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ఈనెల 22న సత్తెనపల్లిలో సామాజిక సాధికార బస్సు యాత్ర
- నియోజకవర్గ పార్టీ క్యాడర్‌తో సన్నాహక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

సత్తెనపల్లి: బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యతను, రాజ్యాధికార గౌరవం, హుందాతనాన్ని కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం జరిగిన సామాజిక సాధికార (బస్సు) యాత్ర సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఈనెల 22న సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లో వైఎస్సార్ సీపీ చేపడుతున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వివిధ సామాజిక వర్గాలకు చెందిన లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో యాత్రలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందారన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనకై సామాజిక సాధికార బస్సుయాత్ర ఒక విప్లవంలా కొనసాగుతుందని సత్తెనపల్లి మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి అన్నారు.

అన్ని వర్గాల నుంచి స్పందన...

సీఎం జగన్‌మోహన్ రెడ్డి పార్టీ పదవుల్లోనూ, కేబినెట్ లోనూ, నామినేటెడ్ పదవుల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు పెద్దపీట వేశారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పక్కాల సూరిబాబు అన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీత హాసంతి, వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి, జిల్లా నాయకుడు బాసు లింగారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మండల పార్టీ అధ్యక్షులు రాయపాటి పురుషోత్తంరావు, నక్కా శ్రీనివాస రావు, వేపూరి శ్రీనివాసరావు, భవనం రాఘవరెడ్డి, నకరికల్లు జెడ్పీటీసీ జోనెబోయిన హరీష్, రాజుపాలెం ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి, సత్తెనపల్లి ఏఎంసీ వైస్ చైర్మన్ శివ రామిరెడ్డి, నకరికల్లు వైస్ ఎంపీపీలు ప్రవీణ్‌రెడ్డి, షేక్ బాషా, వైఎస్సార్ సీపీ మండల నాయకులు షేక్ ఎలవర్తి పాటి ఇస్సా, సంకటి శ్యాంసన్, తుమ్మల వెంకటేశ్వరరావు, గంజి శ్రీనివాసరావు, పీ శివయ్య, సీతారాములు, జేసీఎస్ కన్వీనర్లు బొంతు వెంకట రెడ్డి, కొణతం స్వాతి, పులిబండ్ల అశోక్, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, సచివాలయ, సోషల్ మీడియా కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

సత్తెనపల్లి: బాలబాలికలు వారికి ఉన్నటువంటి హక్కులు, అవకాశాలను వినియోగించుకొని ఉన్నత స్థితికి ఎదగటానికి మంచి బాటలు వేసుకోవాలని సత్తెనపల్లి మండల విద్యాశాఖ అధికారి ఏ శ్రీనివాసరావు అన్నారు. బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామ పంచాయతీ పరిధిలోని రామకృష్ణాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో బాలల హక్కులపై అవగాహన సమావేశం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షతన జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బాల్యంలో పెళ్లిళ్లు భావితరాలకు ఉరితాళ్లని, బాల్యవివాహాలు అంతం చేద్దామన్నారు. ఐసీడీఎస్ అసిస్టెంట్ చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ టి.సంతోష్ కుమారి మాట్లాడుతూ పిల్లలు బాగా చదువుకొని ఉద్యోగాలు తెచ్చుకోవాలన్నారు. సత్తెనపల్లి ఏరియా హాస్పిటల్ గైనకాలజిస్ట్ నలమాల సుమిత్ర, బాలికల గురుకుల వైస్ ప్రిన్సిపాల్ సుజాత, మండల రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, టీచర్ పద్మ, బాలికల జూనియర్ కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

క్రోసూరు: కేజీబీవీ పాఠశాలలో బాలల సంరక్షణ వారోత్సవాల్లో సత్తెనపల్లి హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'బాల్య వివాహాలు - అనర్థాల'పై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు (నాని స్టిక్కరింగ్ పాయింట్ సత్తెనపల్లి) చలి కోట్లు పంపిణీ చేశారు. పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మ్యాథ్స్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్స్‌పాల్ ఇందిరా ప్రియదర్శిని అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలను కలిగి ఉండాలన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి మాట్లాడుతూ నేటి సమాజంలో లింగ వివక్ష, పేదరికం లాంటివి బాల్య వివాహాలకు కారణమవుతున్నాయన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లి బాబు మాట్లాడుతూ బాల్య వివాహాలు కుదిర్చినవారు, వివాహం చేసిన వారు శిక్షార్హులవుతారన్నారు. బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్యవివాహాలపై 1098 నెంబర్లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. అనంతరం అవగాహన పోస్టర్లు ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

రాజుపాలెం: మండలకేంద్రంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో దళిత బహుజన్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలపై గురువారం అవగాహన కల్పించారు. వారోత్సవాలు దళిత బహుజన ఏరియా కో ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటి రత్నం అధ్యక్షతన జరిగింది. హెచ్ఎం శైలజ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని బాల్య వివాహాల వలన వచ్చే అనర్థాల గురించి వివరించారు.

గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ర్యాలీ

క్రోసూరు: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడోరోజు గురువారం క్రోసూరులో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ మాట్లాడుతూ ఉద్యమకారులు గ్రంథాలయాల అభివృద్ధికి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. అనంతరం వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. గ్రంథాలయాలు, పుస్తక పఠనం వల్ల ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయురాలు జి.పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

సత్తెనపల్లి: పట్టణంలోని వైఎస్సార్ మెమోరియల్ శాఖ గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గురువారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలకు జడ్జిగా రిటైర్డ్ లెక్చరర్ సీహెచ్ ఉమామహేశ్వరరావు వ్యవహరించారు. మరో వక్త ఈదర గోపిచంద్ గ్రంథాలయ ఉద్యమం, ఉద్యమ పితామహుల గురించి, గ్రంథాలయం వారోత్సవాల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ఉన్నారు.

అమరావతిలో...

అమరావతి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం స్థానిక శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. స్థానిక గ్రంథాలయాధికారి ఎం.వెంకాయమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు గ్రంథాలయ ఉద్యమనాయకుల జీవితాలపై వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిరపలో సస్యరక్షణ చేపట్టాలి

సత్తెనపల్లి: మిరప సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారి సీహెచ్ జనని అన్నారు. సత్తెనపల్లి మండలంలోని గుడిపూడి, కంటిపూడి గ్రామాలలో క్షేత్రస్థాయిలో మిరప పంటను గురువారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మిరప పంటలో బొబ్బర తెగులు ఆశించడం జరిగిందని, ఇది తెల్ల దోమ ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. లేత ఆకులు చిన్నవిగా మారి పైకి ముడుచుకుని పడవ ఆకారంలో మారతాయని, ఈనెలు ఉబ్బి ఆకుల మీద బొబ్బలు ఏర్పడి ముడుచుకుంటాయన్నారు. దీని నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతుల ద్వారా నివారణ చర్యలు చేపట్టినట్లయితే వైరస్‌ను అరికట్టి పంటను కాపాడుకోవచ్చన్నారు. పొలం గట్ల మీద కలుపు మొక్కలను నిర్మూలించాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన అవసరం

- సీఐడీ ఎస్పీ కేజీవీ సరిత

నకరికల్లు: ఎస్సీ, ఎస్టీ యువత చట్టాలను ఆకళింపు చేసుకొని ఉన్నత చదువులు చదివి జీవితంలో రాణించాలని సీఐడీ ఎస్పీ కేజీవీ సరిత అన్నారు. స్థానిక కల్యాణమండపంలో ఎంపవర్మెంట్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ ఆన్ సెన్సిటైజేషన్ ఆన్ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్ అగైనెస్ట్ దెం కార్యక్రమం గురువారం నిర్వహించారు. సీఐడీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఎస్సీ, ఎస్టీ యువత పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రజల హక్కుల ఉల్లంఘనలు జరిగితే చట్టం కాపాడుతుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం మానవులందరికీ సమానహక్కులు కల్పించిందన్నారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యకోసం ప్రత్యేక చర్యలు చేపడుతుందని అన్నారు. రాజ్యాంగాన్ని యువత చదవి అర్థం చేసుకొని చట్టాల ద్వారా హక్కులను సాధించాలన్నారు. అనంతరం ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల కోసం అమలు చేస్తున్న పథకాలు, పలు చట్టాలపై యువతీయువకులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. స్థానికులు సీఐడీ ఎస్పీ కేజీవీ సరితను, సీఐడీ, పోలీస్ అధికారులను ఘనంగా సత్కరించారు. సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ, సీఐడీ డీఎస్పీ సీహెచ్ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ బి.ప్రేమయ్య, నకరికల్లు ఎస్ఐ ఏ బాలకృష్ణ, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫ్లోరోసిస్ పరీక్షలు నిర్వహణ

- ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్

క్రోసూరు: పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.రవి ఆదేశాల మేరకు క్రోసూరు పీహెచ్‌సీ వైద్య అధికారులు డాక్టర్ రమాదేవి, డాక్టర్ అంకమ్మ బాయ్, డాక్టర్ మహమ్మద్ షాద్, డాక్టర్ సిరి చందన ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులకు దంత ఫ్లోరోసిస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఫ్లోరోసిస్ వ్యాధి లక్షణాలు, నివారణపై అవగాహన కల్పించారు. జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మనదేశంలో ప్రతి వందమందిలో ముగ్గురు ఫ్లోరోసిస్ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. స్వచ్ఛమైన నీరు, జీవన శైలిలో మార్పులు, సమతుల ఆహారం ద్వారా ఫ్లోరోసిస్‌ని నివారించవచ్చన్నారు. పిల్లలు పేస్టు తినకుండా చూడాలన్నారు. విటమిన్ సి, ఇ, క్యాల్షియం కలిగిన ఆహార పదార్థాలు, పండ్లు వంటివి ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణకు దోహదం చేస్తాయన్నారు.